


కేవలం తనని ప్రత్యేకంగా చూడ్డానికే పిలిపించాడని తెలిసిన ప్రతిమ అక్కడ ఉన్న ఐదునిమిషాలూ నిప్పులమీదే నిల్చున్నట్టు గడిపి, అతను అందించిన ఫైళ్ళు అందుకొని బ్రతుకు జీవుడా అని బయట పడింది అప్పటికి.

వారంరోజులు గడిచేసరికల్లా మేనేజరు సుబ్బారావు ప్రవర్తనలో మరిన్ని మార్పులు కనిపించాయి ఆమెకి. ఆడవాళ్ళ ఎదురుగా మాట్లాడకూడనివి కూడా మాట్లాడి అవేపెద్దజోకుల్లా నవ్వడం, చీటికీమాటికీ లోపలికి పిలవడం, డర్టీగా నవ్వడం, టీ, కాఫీలు ఆఫర్‌చేయడం ఇవన్నీ కంటకంగా తోచాయి ప్రతిమకి.

మేనేజరు మనిషిరూపంలో ఉన్న మానవమృగమని, ఏమాత్రం ఏమరుపాటుగాఉన్నా తనను కబళించడం ఖాయమని ఆరోజు ఫైళ్ళతో వెనుదిరుగుతున్నప్పుడు తనపైటను లాగి, తనుకోపంగా చూడగానే 'సారీ...' అంటూ చిన్నగా నసిగినప్పుడే గ్రహించింది ప్రతిమ.

శీలంకంటే ఉద్యోగం గొప్పకాదు. ఈఉద్యోగం వదులుకొని బయటకు వెళ్ళి మరోచోట ఉద్యోగంలో ప్రవేశించినా అక్కడా ఇలాంటి మానవమృగాలు ఉండవన్న గ్యారంటీలేదు. మరలాంటప్పుడు ఇతనికే గుణపాఠం నేర్పితే...? తన ఉద్యోగానికి ఢోకా ఉండదు. ఆ ఆలోచనను కార్యరూపంలో పెట్టడానికి ఉపక్రమించింది ప్రతిమ.

* * *

పోస్టులో క్యాసెట్టేమిటా? అంటూ ఆశ్చర్యంగా అందుకొని, టుఇన్‌వన్‌లో ఇన్‌సర్ట్‌చేసింది మేనేజరు సుబ్బారావు భార్య కాళింది.

సుమారు అరగంటసేపు ఆక్యాసెట్లో వినిపించిన డర్టీజోక్స్‌కు అక్కడ చేరినవారి ముఖంలో కత్తివేటుకు నెత్తురుచుక్కలేనంతగా పాలిపోయాయి. భర్త నిజస్వ-రూపానికి కాళిందికి, తండ్రి ప్రవర్తనపట్ల అతని కూతుళ్ళు సుమన, లలితలకు అసహ్యం కలిగింది. కాళింది వెంటనే, కోపంగాలేచి ఫోనందుకొని ఎక్కడికో డయిల్‌చేసింది.

* * *

మేనేజరు సుబ్బారావుగారు ఆఫీసులోచేరి నెల తిరక్కుండానే తనంతతానుగా మరోబ్రాంచికి ట్రాన్సఫరై వెళ్ళిపోవడం గురించిగానీ, అందులో ప్రతిమ పాత్రగురించిగానీ తెలీని ఆఫీస్‌స్టాఫ్‌కు... మరోవారం తిరక్కుండానే హెడ్డాఫీసునుండి ప్రతిమను ఆఫీసర్స్‌ట్రైనింగ్‌కు రమ్మని వచ్చిన టెలిగ్రాం మాత్రం ఆశ్చర్యం కలిగించింది.

ప్రతిమమాత్రం ఆత్మస్థైర్యంతో తాను సాధించిన విజయంపట్ల ఆనందపడింది.

—యన్.ఉమాపార్వతీనాగేశ్వర్,
పెనుగొండ

# అధికారి

పెళ్ళయి సంవత్సరంకావస్తున్నా... పట్టుమని పది రోజులుకూడా ఒకదగ్గర గడపలేదు సుచిత్ర, సుధీర్. ఇద్దరూ వేర్వేరు ఊర్లలోని ఒకేడిపార్ట్‌మెంట్స్‌లో పని చేస్తున్నారు. సుధీర్ ఉంటున్నది మరీ పల్లెటూరవ్వడంతో సుచిత్ర పనిచేస్తున్న హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్‌కోసం తీవ్రప్రయత్నం చేస్తూ...ఈలోగా యధాశక్తిని ఆర్.టి.సి వారి ఆదాయం పెంచుతూ హైదరాబాద్‌కు ఆ పల్లెటూరుకు 'అప్‌అండ్‌డౌన్' సర్వీస్ చేస్తున్నాడు.

అతని ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాలొకప్రక్క జరుగుతుండగా ఇక్కడ సుచిత్ర "శ్రీవారి స్కూటర్‌వెనుక అలవోకగా కూర్చుని అతని భుజంమీద చేయివేసి 'జోరుగా హుషారుగా ఆఫీసుకేగెదమా...?' అని ఇద్దరూ పాడుకుంటూ ఆఫీసుకెళ్తున్నట్లు, "నీకేమే ఆఫీసరే... నీమొగుడు , నీ మొగుడే ఆఫీసర్" అని అంటూ కొలీగ్స్ అంతా ఈసుగా చూస్తున్నట్లు ఈస్ట్‌మన్ కలర్ కలలు కంటోంది. రోజూ ఆఫీస్ అవగానే మళ్ళీ ఇద్దరూ అలా టాంక్‌బండ్‌కో, నీ బత్ పహాడ్‌కో,ఇందిరా పార్క్‌కో, పబ్లిక్ గార్డెన్స్‌కో వెళ్ళి కాస్సేపు గడిపి హోటల్‌లో డిన్నర్ తీసుకుని ఇక ఇంటికెళ్ళి హాయిగా నిద్రపోవడమే అనుకుంటూ కంటిన్యూగా కలలు కంటూ, కన్న కలలు నెమరవేసుకుంటూ గడుపుతోంది.

పైగా ఇపుడున్న ఆఫీసర్ అపర దుర్వాసుడు ఎప్పుడు చూసిన చిటపటలాడుతూ కోడిగుడ్డు కొట్టి పోస్తే ఆమ్లెట్ అవుతుందా అన్నంత వేడిగా చూస్తూ వాడిగా మాట్లాడ్తూ సతాయిస్తుంటాడు. శ్రీవారు ఆఫీసర్‌గా వస్తే వాడి చూపులు, విరితూపులు , తప్ప విసుర్లు కసుర్లు చురకలు ఉండవు కదా అనుకుంటూ శ్రీవారి ట్రాన్స్‌ఫర్ కోసం ఎదురుచూస్తున్నది. అంతలో... 'కల నిజమాయెగా కోరిక తీరెగా' అన్నట్లుగా అతనికి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాడు. క్రితం రోజే డ్యూటిలో లాంచన ప్రాయంగా జాయిన్ అయ్యాడు. 'దుర్వాసుడి స్థానంలో వచ్చి చేరింది నా మొగుడేగా ఇక ఇవాల్టి నుండి ఆఫీసులో ఎంతో ఫ్రీగా హాయిగా ఉండవచ్చు. ననుకుంటూ డ్రాఫ్ట్ తయారుచేసి శ్రీవారి గదిలోకి.... అశ్రీ ఆఫీసర్‌గారి గదిలోకి అడుగుపెట్టింది.

"వాట్ మేడం....ఎమిటీ డ్రాఫ్టింగ్..ఇలా చెత్త చెత్తగా తప్పుల తడకలా రాసుకు వస్తే ఎలా...." అరిచాడతను.

తెల్లబోయింది...."అది కాదండీ...." అంది బెరుకుగా.

"కాల్‌మీ యాజ్ బాస్...." ఉరిమాడు.

"యస్ బాస్....అన్నది వణికిపోతూ..

"ఆఫీస్‌లో ఉన్నపుడు మైండ్ అబ్సెంట్ బాడీ ప్రజెంట్ అన్నట్లుగా ఉండి వర్క్ చేస్తే కుదరదు... అర్థమైందా"... గాండ్రించాడు.

"యస్ బాస్"

"వెళ్ళండి, వెళ్ళి మళ్ళీ ఈ డ్రాఫ్ట్ కరెక్ట్ చేసి తీసుకు రండి..." హుకుం జారీచేశాడు.

"యస్ బాస్" అంటూ బెదురు చూపులు చూస్తూ వెళ్ళిపోతున్న శ్రీమతిని చూస్తే జాలేసింది. 'సుచీ డీయర్' అంటూ దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకోవాలనిపించింది. తల విదిలించుకుని మళ్ళీ ఆఫీసర్ ముసుగు వేసేసుకున్నాడు.

* * * *

"సుచీ డియర్..." హుషారుగా ఆమె వెంట వెంటే తిరుగుతూ అరగంటనుండి ఆమెను మాటల్లో పెట్టాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు సుధీర్. కాని ఆఫీసులో ముడుచుకున్న బుంగ మూతి ఇంత వరకూ విడివడలేదు. ఆమె విదిలించుకొంటున్న కొద్దీ దగ్గరకు తీసుకుని గుండెల్లో పొదువుకుంటూ—

"అక్కడ నేను 'అధికారి'ని ఇక్కడనీవు ఈ ఇంటి దీపానివి. నా హృదయ సామ్రాజ్ఞివి. అక్కడ అలాగే ఉండాలి, ఇక్కడ ఇలా ఉండాలి" అంటూ కితకితలు పెట్టాడు. హాయిగా కిలకిలా నవ్వింది సుచిత్ర.

* * *

ఉమా శివ, మంచిర్యాల్